గ్రూప్‌-1 అధికారిగా ఆటోడ్రైవర్ కుమారుడు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని లంబాడీ తండాకు చెందిన ఆటోడ్రైవర్ వర్త్య పంత్య నాయక్ కుమారుడు వర్త్య మహేష్ నాయక్ ఇటీవల విడుదలైన గ్రూప్‌-1 ఫలితాల్లో ఎంపీడీఓగా ఎన్నికయ్యారు. గ్రూప్‌-1 ఫలితాల్లో 731వ ర్యాంకు రావడంతో మహేష్ నాయక్ ఎంపీడీఓగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహేష్‌తో పాటు ఆయన తండ్రి పంత్యానాయక్‌ను ఘనంగా సత్కరించారు. మహేష్ నాయక్ ప్రస్తుతం గ్రూప్‌-4కు ఎంపికై వాటర్ వర్క్స్ బోర్డులో రెవెన్యూ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. గ్రూప్‌-3లోనూ 1:1 జాబితాలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు కళ్యాణ్‌నాయక్, రమేష్‌రెడ్డి, అయిలినేని కిషన్‌రావు, సైకిలాబ్‌బాబు, అంబటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా రాణించాలని సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రలో తెలుగు సాంస్కృతి సాహితీ సేవా ట్రస్టు ఆధ్వర్యంలో తెలంగాణ సాంస్కృతి సాహితీ బుక్ ఆఫ్ రికార్డు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో రాణిస్తున్న పలువురు నృత్యకారులను అవార్డులతో సన్మానించారు. అనంతరం దైవజ్ఞ శర్మ మాట్లాడుతూ... కూచిపూడి, భరతనాట్యాలకు ప్రపంచ వ్యాప్తంగా మంచి ఆదరణ ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు డా. మాచవరం గౌరీశంకర్, సూర్యపల్లి విజయ్, పరాకు ప్రసన్నలక్ష్మీ, మాధురి, వెంకట రమణ మూర్తి, కోటా రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ గొప్ప దేశభక్తుడు



భగత్‌సింగ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎన్‌ఆర్ లక్ష్మణ్‌రావు, సుదర్శన్

కాచిగూడ: బ్రిటీష్ వలసవాదులకు వ్యతిరేకంగా, దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి, చిరునవ్వుతో ఉరి కంబాన్ని ముద్దాడిన భగత్‌సింగ్ నిజమైన గొప్ప దేశభక్తుడని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ఆర్ లక్ష్మణ్‌రావు అన్నారు. ఆదివారం భగత్ సింగ్ 118వ జయంతిని పురస్కరించుకుని పలువురు నేతలు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భగత్‌సింగ్ స్ఫూర్తితో సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా ఉద్యమించి దేశ వనరులను కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో శివసేన నాయకులు సుదర్శన్, గౌట్ గణేష్, దత్తు పటేల్, దత్తాత్రేయ, మన్ను సింగ్ తదితరులు పాల్గొన్నారు.



బతుకమ్మకుంటలో బతుకమ్మ ఆడుతున్న మేయర్, కార్పొరేటర్లు



వేదికపై సీఎంతో ఎమ్మెల్యే, స్థానిక కార్పొరేటర్లు

మూసీకి రిటైనింగ్ వాల్ నిర్మించాలి

- బతుకమ్మకుంట ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్
- మూసీ వెంట నివసిస్తున్న పేదలకు సీపీఎల్ స్థలాన్ని కేటాయించాలి
- రాజకీయాలకు అతీతంగా అంబర్‌పేట అభివృద్ధికి సహకరించాలని వినతి
- హామీలన్నింటిని నేరవేర్చేందుకు సిద్ధమన్న సీఎం రేవంత్‌రెడ్డి
- డిసెంబర్ 9 నాటికి హామీల ఆమోదానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎం ఆదేశం



అంబర్‌పేట: రాజకీయాలకు అతీతంగా అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ఆదివారం సీఎం రేవంత్ రెడ్డిని కోరారు. బతుకమ్మకుంట ప్రారంభోత్సవానికి హాజరైన సీఎం కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రత్యేకంగా మాట్లాడారు. నియోజకవర్గంలో మెజార్టీగా బడుగు బలహీన వర్గాల ప్రజలు నివస్తున్నారని చెప్పారు. వారికి అండగా నిలవాలని ఆయన సీఎం కోరారు.

నియోజకవర్గంలో 5 కిలోమీటర్ల మేర మూసీ ఉంది..

◆ మూసీ పునరుజ్జీవంలో భాగంగా అంబర్‌పేట నియోజకవర్గంలో 5 కిలోమీటర్ల మేర మూసీకి రిటైనింగ్ నిర్మించాలని సీఎంను కోరారు. మూసీ వెంట నివసిస్తున్న పేదలకు అంబర్‌పేటలో సీపీఎల్ స్థలాన్ని కేటాయించాలన్నారు. నియోజకవర్గానికి చెందిన ప్రభుత్వ కార్యాలయాలు ఇతర ప్రాంతాల్లో ఉన్నాయని వాటిని స్థానికంగా ఏర్పాటు చేసేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కనీసం ఫైర్‌స్టేషన్ కూడ ఇక్కడ లేదని ఎమ్మెల్యే సీఎంకు తెలిపారు.

వీహెచ్ పేరును బతుకమ్మకుంటకు పెట్టాలి

◆ అంబర్‌పేటలో రూ.400 కోట్లతో ఫ్లైఓవర్ నిర్మిస్తే అంబర్‌పేటకు పెద్దగా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. అంతేకాకుండా సర్వీసు లేక నిత్యం వేలాది మంది ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలో పార్కుల అభివృద్ధికి రూ.10 కోట్ల ప్రత్యేక నిధులు కావాలని ఎమ్మెల్యే కోరారు. బతుకమ్మకుంట అభివృద్ధికి కర్త, కర్మ అయిన మాజీ ఎంపీ వీహెచ్ పేరును బతుకమ్మకుంటకు పెట్టాలని సీఎంను కోరారు.

ఎమ్మెల్యేను అభినందించిన సీఎం రేవంత్‌రెడ్డి..

◆ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే వ్యాఖ్యలకు స్పందించారు. రాజకీయాలకు అతీతంగా స్థానికంగా ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అభివృద్ధి పనులకు సహకరించడం అభినందనీయమని కితాబిచ్చారు. మూసీతో పాటు ఎమ్మెల్యే కోరిన ప్రభుత్వ కార్యాలయాలు అన్ని ఒకేచోటకు తీసుకొస్తామన్నారు. మినీ సచివాలయం ఏర్పాటుకు చొరవ తీసుకుంటానని హామీ ఇచ్చారు. దీనిపై ప్రత్యేక ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌కు సూచించారు. డిసెంబర్ 9లోపు ప్రతిపాదనలు సిద్ధం చేస్తే వాటిని ఆమోదించేలా తాను చేయూతనిస్తానని సీఎం హామీ ఇచ్చారు.

సందడిగా ప్రారంభోత్సవ వేడుక..

అంబర్‌పేట: బతుకమ్మకుంట ప్రారంభోత్సవం సందర్భంగా జరిగింది. ఆదివారం సీఎం చేతుల మీదుగా జరగడంతో స్థానికుల్లో ఆనందోత్సవం వెల్లివిరిసింది. మహిళలు, కార్పొరేటర్లు బతుకమ్మ ఆడిపాడి సందడి చేశారు. సీఎంకు కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. వేదికపై స్థానిక ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్యేతో పాటు కార్పొరేటర్లు అందరు

ప్రారంభోత్సవ హైలైట్స్..

- బతుకమ్మకుంట వేదికకు కొద్ది దూరంలో ఉన్న చౌరస్తాలో సీఎం కారు దిగి నడుచుకుంటూ వేదిక వద్దకు చేరుకున్నారు.
- మొదట నీటి కొలను వద్దకు చేరుకుని గంగమ్మకు పూజలు నిర్వహించి వేదిక వద్దకు వెళ్లారు.
- సభా వేదికపై మహిళలకు ప్రాధాన్యం కల్పించేందుకు సీఎం స్వయంగా లేచి వేదికపై వారు ఆశీనులయ్యేలా చొరవ తీసుకున్నారు.
- విమలక్క పాటలకు కోరస్ కావాలంటే స్వయంగా మంత్రి సీతక్క వెళ్లి ఆమె వెనుక నిలుచుని కోరస్ అందించారు.
- ప్రముఖ జానపద గాయిని కనకవ్వ వేదికపై మొదటి వరుసలో కూర్చుని ఆమెకు పాట పడేందుకు ప్రత్యేక అవకాశం కల్పించారు. ఆమెకు కోరస్ సైతం మంత్ర సీతక్క, మేయర్, డిప్యూటీ మేయర్‌లు అందించారు.
- వీహెచ్ మాట్లాడుతారు అనగానే సభ మొత్తం చప్పట్లతో మార్మోగింది.

రెడ్డి జాగృతి వేసిన పిటిషన్‌ను విరమించుకోవాలి



సమావేశంలో బీసీ సంఘాల ప్రతినిధులతో కలిసి మాట్లాడుతున్న గుజ్జ సత్యం

కాచిగూడ: తెలంగాణలో 60శాతం జనాభా కలిగిన బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిన ప్రభుత్వ ఆర్డర్‌ను హైకోర్టులో సవాల్ చేసిన రెడ్డి జాగృతి పిటిషన్‌ను వెంటనే విరమించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే కుట్రలకు రెడ్డి సమాజం సహకరించొద్దన్నారు. ఆదివారం కాచిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బీసీలు ఏ సామాజిక వర్గానికి వ్యతిరేకం కాదని... రెడ్డి జాగృతికి చెందిన వారు బీసీలపై కుట్రలు చేస్తూ వారికి దక్కాల్సిన హక్కులను దక్కకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారని ఆరోపించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ల పెంపు బీసీల పోరాట విజయమని అన్నారు. దీనికి చిత్తశుద్ధితో వ్యవహరించిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, బీసీ మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రులు, మద్దతు పలికిన బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ పార్టీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలంగాణ యూత్ జర్నలిస్టు అసోసియేషన వ్యవస్థాపక అధ్యక్షుడు డా. తనుగుల జితేందర్‌రావు అన్నారు. ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టు సమస్యల పరిష్కారం పెండింగ్‌లో పడ్డాయన్నారు. ఆ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి తన వంతు పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా జర్నలిస్టులకు సంబంధించిన డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు సమస్యతో పాటు హెల్త్ కార్డు సమస్యల పరిష్కారానికి కూడా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీహాల్‌ను వినియోగంలోకి తీసుకురావాలి

ముషీరాబాద్: రాంనగర్ డివిజన్‌లోని హరినగర్‌లోని కమ్యూనిటీహాల్‌ను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు రేశం మల్లేష్, సీనియర్ నేత సిరిగిరి శ్యామ్ డిమాండ్ చేశారు. ఆదివారం హరినగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుదారు. అప్పటి హోంశాఖమంత్రి నాయిని నర్సింహారెడ్డి తన ఎమ్మెల్సీ నిధుల నుంచి రూ.78లక్షలు హరినగర్‌లో కమ్యూనిటీహాల్ నిర్మాణానికి విడుదల చేశారన్నారు. అయితే నిర్మాణం పూర్తయి మూడేళ్లయినా కమ్యూనిటీహాల్ మాత్రం ప్రారంభించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. కాంట్రాక్టర్ తనకు నిధులు మంజూరు కాలేదనే కారణంతో కమ్యూనిటీహాల్‌కు తాళం వేసుకుని తన ఆధీనంలో ఉంచుకుంటున్నారని ఆరోపించారు. ఈ విషయంపై జీహెచ్ఎంసీ డీఈ, ఏఈలను సంప్రదించగా తమకు ఈ విషయం తెలియదని దాటవేస్తున్నారని తెలిపారు. రాజకీయాలకు పక్కనపెట్టి కమ్యూనిటీహాల్‌ను వెంటనే ఉపయోగంలోకి తీసుకురావాలని వారు డిమాండ్ చేశారు.

అంబర్‌పేట అభివృద్ధికి సీఎం కృషి ప్రశంసనీయం



టీపీసీసీ ఉపాధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ అలంఖాన్

కాచిగూడ: అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయమని టీపీసీసీ అధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ అలంఖాన్ అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో అప్పటి సీఎంగా కేసీఆర్ ఏ ఒక్కనాడు కూడా అంబర్‌పేట నియోజకవర్గాన్ని సందర్శించలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇప్పటి వరకు ఐదారు సార్లు అంబర్‌పేట నియోజకర్గంలో పర్యటించారని అన్నారు. అంతేకాకుండా పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపి రూ.10కోట్ల నిధులతో బతుకమ్మకుంట నిర్మాణానికి సహకరించారని అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కబ్జాకు గురైన బతుకమ్మ కుంట చెరువును హైడ్రా ద్వారా పునర్ నిర్మించారని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అంబర్‌పేట నియోజకవర్గానికి చేసింది ఏమీ లేదని అన్నారు.

ఐఐఎఫ్ఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఐజాక్‌రాజ్



నల్లకుంట: ఇండో ఇజ్రాయేల్ ఫ్రెండ్‌షిప్ అసోసియేషన్ (ఐఐఎఫ్ఏ) తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నల్లకుంటకు చెందిన ఐజాక్‌రాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఐఐఎఫ్ఏ జాతీయ చైర్మన్ డాక్టర్ ఆడంరాజ్ డెక్కపాటి ఆయన నియామకాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా ఐజాక్‌రాజ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ పదవి అప్పగించినందుకు జాతీయ చైర్మన్ డా. ఆడం రాజ్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు.

నవయుగ చక్రవర్తి గుర్రం జాషువా



ట్యాంక్‌బండ్‌పై గుర్రం జాషువా విగ్రహానికి నివాళులర్పించిన స్కైలాబ్ బాబు, భూపతి వెంకటేశ్వర్లు

కవాడిగూడ: కులమత అసమానతలపై అక్షర యుద్ధం చేసి నవయుగ చక్రవర్తి గుర్రం జాషువా అని కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబాబు, తెలంగాణ సాహితి రాష్ట్ర కన్వీనర్ పి.ఆనందాచారి, టీపీఎస్‌కే అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు అన్నారు. గుర్రం జాషువా 130వ జయంతిని ఆదివారం ట్యాంక్‌బండ్‌పై ఉన్న జాషువా విగ్రహం వద్ద సభ నిర్వహించారు. తొలుత జాషువా విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి కె.ఆనందాచారి, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైలాబ్ బాబు, తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం రాష్ట్ర అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భారతదేశ సామాజిక సాహిత్య రంగంలో జాషువా కవిత్వం ఓ చైతన్య స్ఫూర్తి అని అన్నారు. కులమత బేధాలు, పేదరికం తన గురువుగా భావిస్తున్నానని జాషువా చెప్పారన్నారు. వాటి మాలాలపై కలంతో యుద్ధం చేశారని తెలిపారు. మనువాద విష సంస్కృతిపై మహోద్యమం నిర్మించారని చెప్పారు. దేవుడి గుడిలోకి ప్రవేశం లేని దళితుల గోడు వినిపించమని 'గబ్బిలం'ద్వారా సందేశం పంపిన ఒక తిరుగుబాటు దారుడని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధులు విజయ్‌కుమార్, అనంతోజు మోహన్‌కృష్ణ, ఎస్‌కే సలీమా, శరత్ సుదర్శి, సుబ్బారావు, బాలపీరు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సమసమాజ స్థాపనకు జాషువా కృషి మరువలేనిది

చిక్కడపల్లి: సమసమాజ స్థాపనకు గుర్రం జాషువా తన రచనలతో కృషి చేశారని విశ్రాంత జడ్జి బూర్గుల మధుసూదన్ అన్నారు. గుర్రం జాషువా జయంతిని పురస్కరించుకుని పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్, కసుమ ధర్మన్న కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం త్యాగరాయ గాన సభలో కవి సమ్మేళనం, గుర్రం జాషువా పురస్కారాలు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన ఎంపిక చేసిన పలువురు ప్రముఖులకు పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. హరినారాయణరెడ్డి, మురళీ మోహన్ రాజు, రాధాకుసుమ, టి.మయూరి, భాస్కర్, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

జాషువా గొప్ప స్ఫూర్తి శిఖరం...

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మహాకవి గుర్రం జాషువా నేటి తరానికి గొప్ప స్ఫూర్తి శిఖరమని వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ అధ్యక్షుడు పీవీ నిరంజన్‌రెడ్డి అన్నారు. ఆదివారం సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మహాకవి గుర్రం జాషువా 130వ జయంతి జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు సంపత్‌రెడ్డి, మురళీకృష్ణ, రమేష్ రెడ్డి, కిషన్‌రావు, కళ్యాణ్‌నాయక్, స్కైలాబ్ బాబు, రమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

న్యూరామాలయంలో చండీహోమం నిర్వహిస్తున్న వేదపండితులు



అడ్వకేట్స్‌కాలనీలో చండీహోమంలో ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్



లింగంపల్లిలోని దేవాలయం వద్ద అన్నదానం చేస్తున్న రమేష్‌యాదవ్, బీజేపీ నేతలు



గండి మైసమ్మ దేవాలయం వద్ద మండపంలో ఎమ్మెల్యే ముఠాగోపాల్, వెంకట గోవిందరావు



నాగమ్మయ్య కుంట మండపంలో బీఆర్ఎస్ నేత ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, బీజేవైఎం నేత నవీన్



శ్రీమాత్రే నమః

అంగరంగ వైభవంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు



వారాహిదేవీగా చేపల మార్కెట్‌లోని ఉప్పలమ్మ దేవి



రాజరాజేశ్వరిదేవీగా వివేక్‌నగర్ భువనేశ్వరిదేవి



మోహిని అలంకరణలో శంకరమఠం శారదాంబ



కాత్యాయని అలంకరణలో అంబర్‌పేట మహంకాళి

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం నల్లకుంట శంకరమఠంలో కొలువైన శారదా మాత 'మోహిని'రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వర్ణకచిత (బంగారు చీర)లో ఉన్న అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం (ఏడో రోజు) అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారికి కుంకుమార్చనలు, చండీహోమం, సహస్రనామార్చనలు నిర్వహించారు. ఆలయాల పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. ఆలయాలు, మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. మండపాల వద్ద మాతారాణికా జాగారణ్ కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లువిరిసింది.

– ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం



యంగ్‌మెన్స్ అసోసియేషన్ మండపంలో మాజీ కార్పొరేటర్లు



జైస్వాల్‌గార్డెన్‌లో జరిగిన పూజలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్



అంబర్‌పేటలోని మండపంలో బీఆర్ఎస్ నేత నర్సింహారెడ్డి



సీపీఎల్ రేణుకమ్మ ఎల్లమ్మ ఆలయ పూజలో మహిళలు

మోదీ హయాంలోనే దేశ సమగ్రాభివృద్ధి

ముషీరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ పాలనలో దేశ సమగ్రాభివృద్ధి చెందుతోందని ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ పేర్కొన్నారు. బీజేపీ అధిష్టానం పిలుపు మేరకు ఆదివారం ముషీరాబాద్‌లో సేవా పఖ్వాడా కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య మహిళా కార్మికులకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహంకాళీ జిల్లా పార్టీ అధ్యక్షుడు భరత్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రధాని పని చేస్తూ అన్ని వర్గాలకు ప్రజలకు అండగా నిలుస్తున్నారు అన్నారు. పేదల పక్షపాతిగా అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కంచి ముదిరాజ్, నాయకులు లక్ష్మణ సత్యనారాయణ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైశ్య హాస్టల్‌లో మరిన్ని వసతులు

కాచిగూడ: విద్యార్థులకు మరిన్ని మెరుగైన వసతులను కల్పించే విధంగా తమవంతు కృషి చేస్తున్నట్లు వైశ్య హాస్టల్ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ జయప్రకాష్ రామ్ తెలిపారు. ఆదివారం కాచిగూడలోని వైశ్యహాస్టల్ ప్రాంగణంలో ఆధునీకరించిన విద్యార్థుల హాస్టల్ గదులను ఆయన ప్రారంభించారు. చదువుకునే పేద విద్యార్థులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. హాస్టల్‌లో అందిస్తున్న వసతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హాస్టల్ ట్రస్ట్‌బోర్డు కార్యదర్శి మల్లికార్జున్, వెంపటి మధు, రాజేశ్వర్, రవిప్రసన్నకుమార్, రాజేశ్వర్‌రావు, నారాయణ భాస్కర్ గుప్తా, తదితరులు పాల్గొన్నారు.